# ఎక్స్‌రే లేదని రోగులను బయటికి పంపిస్తారా

- పేదలను ఇబ్బంది పెడితే సహించేది లేదు
- దిశ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్/కలెక్టరేట్, డిసెంబర్ 24: ప్రభుత్వ దవాఖానలో కనీసం ఎక్స్‌రేలు తీసేందుకు సైతం మిషన్లు లేవని రోగులను బయటికి పంపించడం ఏంటని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అధికారులను ప్రశ్నించారు. పేదలకు రోగం వస్తే ఏకైక దిక్కు ప్రభుత్వ దవాఖానే కదా, వీటి తీరు మారకపోతే రోగులు ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనా అని నిలదీశారు. పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు చలించరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. కరీంనగర్–సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం కరీంనగర్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌సిటీ, వైద్య, విద్యాశాఖలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రెడ్కో, పరిశ్రమల శాఖ, చేనేత జౌళి శాఖ, పార్లమెంట్ సభ్యుడి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో కేంద్ర సహాయ మంత్రి సమీక్షించారు. వైద్యశాఖకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులిస్తున్నా వాటి పనితీరు మెరుగుపరుచుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ నియామకాల్లో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా ప్రధాన దవాఖాన, కరీంనగర్‌లో చాలా నిధులు గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు వస్తున్నాయని, సిరిసిల్ల దవాఖాన సైతం ఘోరంగా తయారైందన్నారు. మళ్లీ సమావేశం నిర్వహించే నాటికి ప్రభుత్వ దవాఖానల రూపురేఖలు మారిపోవాలని, మందులు, ఎక్స్‌రే మిషన్ లేదనే ఫిర్యాదులు రావద్దని స్పష్టం చేశారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడారు. సమావేశంలో సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, కేంద్ర సహాయ మంత్రి ఓఎస్డీ, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే.మహేశ్వర్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### భారత్ బ్రాండ్ స్కీమ్ ప్రొడక్ట్ వాహనాల ప్రారంభం

విద్యానగర్, డిసెంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం, నాఫెడ్ ఆధ్వర్యంలో భారత్ బ్రాండ్ స్కీమ్ పేరిట ప్రవేశపెట్టిన నిత్యావసర వస్తువుల వాహనాలను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలెక్టర్ పమేలా సత్పతి, నాఫెడ్ స్టేట్ డిప్యూటీ మేనేజర్ పట్నాయక్, నైవేద్యం ఫుడ్స్ నిర్వాహకుడు బోనగిరి సంతోష్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమ్మె విరమించాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి: కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి

చిగురుమామిడి, డిసెంబర్ 24: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా కేజీబీవీల్లో ఇంకా సిలబస్ పూర్తికాక పోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని, ఉపాధ్యాయులు సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సగం మంది ఉపాధ్యాయులు సమ్మెలో ఉండగా విధుల్లో ఉన్న వారందరూ అన్ని తరగతులు జరిగేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా ఉందని, రాష్ట్ర నాయకులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఎంఈవో పావని, నాయకులు, తదితరులున్నారు.

### విత్తనాలకు ఇబ్బంది లేకుండా ఆదేశించాం

సైదాపూర్, డిసెంబర్ 24: రైతులకు విత్తనాలకు ఇబ్బంది లేకుండా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత నీటి లభ్యత ఆధారంగా యాసంగి సీజన్‌లో 2024–25 కోసం ఎస్‌ఆర్‌ఎస్‌పీ స్టేజ్–1, స్టేజ్–2 కింద సాగు నీరు అందిస్తామన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని పంటలు త్వరగా వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, నాయకులు ఉన్నారు.

### ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన ర్యాలీ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 24: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం నగరంలోని గీతా భవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు డప్పుచప్పుళ్ల మధ్య బతుకమ్మలు, బోనాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. వారి సమ్మె 15వ రోజుకు చేరిన సందర్భంగా ఈ క్యాక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

### ఈపీఎఫ్‌పై అవగాహన

విద్యానగర్, డిసెంబర్ 24 : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అవగాహన, ఔట్ రీచ్ కార్యక్రమాన్ని ఈనెల 27న ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు కరీంనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్‌లో, పెద్దపల్లిలోని నెహ కాన్సెప్ట్ స్కూల్, జగిత్యాలలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, సిరిసిల్లలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

### కరీంనగర్‌కు రెండు ‘1912’ వాహనాలు

ముకరంపుర, డిసెంబర్ 24: అత్యవసర సమయాల్లో సత్వరమే మరమ్మతులు చేపట్టి వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించేందుకు కరీంనగర్ సర్కిల్‌కు ఎన్పీడీసీఎల్ సంస్థ రెండు అత్యవసర వాహనాలు కేటాయించింది. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై 1912కు కాల్ చేసి తెలియజేసిన వెంటనే స్పందించి సత్వరమే పరిష్కరించేలా రెండు 1912వాహనాలు కేటాయించగా, కరీంనగర్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటి ద్వారా కరీంనగర్ టౌన్–1, 2వ డివిజన్లలో సత్వర సేవలు అందించేలా ప్రత్యేక బృందాలు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తాయని సర్కిల్ ఎస్ఈ ఎం రమేశ్‌బాబు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
CHANGE OF NAME
★Donthula RajiReddy S/o. Donthula Thakkareddy, H.No. 6-67/B, Anupuram, Vemulawada, Rajanna Sircilla Dist, my surname was changed to Donthula Rajireddy, S/o. Donthula Thakkareddy, my mother name Donthula Mallamma Wife Name Donthula Srimathi
NTK-0000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189



అల్ఫోర్స్‌లో కేక్ కట్ చేస్తున్న నరేందర్ రెడ్డి



పారమిత విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రదర్శన



అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలలో ప్రత్యేక దుస్తుల్లో విద్యార్థులు

## ఘనంగా ముందస్తు క్రిస్మస్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 24 : జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, అల్ఫోర్స్, పారమిత, అద్విత, బ్లూబెల్స్, సిద్ధార్థ విద్యాసంస్థల్లో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వారు పాడిన గీతాలు అలరించాయి. క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులకు క్రిస్మస్ చెట్టు తయారీ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిన్నారులు ప్రత్యేక దుస్తుల్లో హాజరై సందడి చేశారు.

కొత్తపల్లి, డిసెంబర్ 24 : వాణీనికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు పండుగ విశిష్టతను తెలియజేసేలా దుస్తులు ధరించి యేసుక్రీస్తు బోధనలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ రేణుక, ఇన్‌చార్జి సందీప్ జేసన్, అకాడమిక్ కోఆర్డినేటర్ సుమశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మానేరు విద్యా సంస్థలు, సెయింట్ జార్జ్ సీబీఎస్‌ఈ పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మానేరు విద్యా సంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, సెయింట్ విద్యా సంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గంగాధర: వివేకానంద లిటిల్ జీనియస్ పాఠశాలలో..

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 24: తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల సీబీఎస్‌ఈ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన యేసు జననం నాటిక ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిదురాల దినేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేశ్, స్టాఫ్ ఇన్‌చార్జి శరత్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గంగాధర, డిసెంబర్ 24: మధురానగర్‌లోని వివేకానంద లిటిల్ జీనియస్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 24: పట్టణంలోని సాయిరూప ఫంక్షన్‌హాల్‌లో తహసీల్దార్ కనకయ్య ఆధ్వర్యంలో అధికారికంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలోనే ఈ సారి కూడా క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు ఇస్తే బాగుండునని అభిప్రాయపడ్డారు, కార్యక్రమంలో ఆర్ఐలు రంజిత్, శేఖర్, చర్చిల పాస్టర్లు, పట్టణ, వివిధ గ్రామాల క్రైస్తవులు పాల్గొన్నారు.



బ్లూబెల్స్ పాఠశాలలో వివిధ వేషధారణల్లో హాజరైన విద్యార్థులు



హుజూరాబాద్ రూరల్: ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాణీనికేతన్ పాఠశాలలో క్రిస్మస్ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

## ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల సత్తా

- ఎస్సెస్సీ ఫలితాల్లో 21 మంది ఉద్యోగాలకు ఎంపిక



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు

కొత్తపల్లి, డిసెంబర్ 24 : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కానిస్టేబుల్ (ఎస్సెస్సీ) ఫలితాల్లో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న ప్రకటించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కానిస్టేబుల్ (జీడీ) ఫలితాల్లో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఇందులో బీఎస్‌ఎఫ్‌కు 10, సీఐఎస్‌ఎఫ్‌కు 5, సీఆర్‌పీఎఫ్‌కు 3, ఏఆర్‌కు 2, ఎస్ఎస్‌బీకి 1, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూప్–వైకు ఒక్కరి చొప్పున ఎంపికయ్యారన్నారు. వీరితో పాటు అక్టోబర్‌లో వెలువడిన ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్‌లో ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. మారుతున్న అభ్యర్థుల ఎంపిక విధానానికి అనుగుణంగా విద్యార్థులను శారీరకంగా, మానసికంగా సిద్ధం చేయడంతోనే ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. రాష్ట్రంలోనే అత్యుత్తమైన బోధనా ప్రమాణాలతో శిక్షణలను అందిస్తున్నట్లు తెలిపారు. డిఫెన్స్ రంగంలో వెలువడే ప్రతి నోటిఫికేషన్‌లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అమ్మాయిలకు ప్రత్యేకంగా సపరేట్ క్యాంపస్ ఏర్పాటు చేసి డిఫెన్స్ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

విద్యానగర్, డిసెంబర్ 24 : వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని కన్జ్యూమర్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కన్జ్యూమర్ రైట్స్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులు హక్కులను తెలుసుకొని వ్యాపారులను ప్రశ్నించవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పామరాజు రామారావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గడప కోటేశ్, జోనల్ సెక్రటరీ బత్తిని శ్రీనివాస్, లీగల్ అడ్వయిజర్ బండ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే యథాతథం

శంకరపట్నం, డిసెంబర్ 24: ఈ నెల 25, 26 క్రిస్మస్ సెలవు రోజుల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల సర్వే యథాతథంగా కొనసాగుతుందని తహసీల్దార్ బత్తుల భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆధార్ కార్డ్, భూముల వివరాలు, నాలా పన్ను, ఇంటి పన్ను, రసీదులు అందుబాటులో ఉంచుకొని సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు.
జిల్లా ప్రజలకు, మిత్రులకు, అధికారులకు శ్రేయోభిలాషులకు క్రిస్మస్ శుభాకాంక్షలు
JAS
Bakery & Sweets,Karimnagar.

### డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఆర్టీసీ ఆర్‌ఎం

తెలంగాణచౌక్, డిసెంబర్ 24: డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆర్టీసీ ఆర్‌ఎం బీ రాజు సూచించారు. మంగళవారం బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో రీజియన్ పరిధిలోని 11 డిపోల డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డ్రైవరు మద్య, ధూమపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్యూటీ ముందు తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్ల మీద ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతి రెడ్డి, సత్యనారాయణతో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

### రైతుపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

వీణవంక, డిసెంబర్ 24: మక్క చేనుకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన హిమ్మత్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మారం వెంకటరాజిరెడ్డి మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో గ్రామ శివారులో గల మక్క చేనుకు నీళ్లు పెడుతుండగా, ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటరాజిరెడ్డి ఎడమ చేతికి తీవ్ర గాయాలు కాగా హనుమకొండకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ‘అమిత్ షాపై కేసు నమోదు చేయాలి’

రాంనగర్, డిసెంబర్ 24: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అంబేద్కర్, రాజ్యాంగంపై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఇందిరా చౌక్ వరకు బాబా సాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

### శతాధిక వృద్ధురాలు మృతి

చిగురుమామిడి, డిసెంబర్ 24: రామంచ గ్రామానికి చెందిన చెరుకు ఎల్లవ్వ (115) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమె భర్త మల్లయ్య 50 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఎలవ్వకు ఐదుగురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు, మనుమలు, మునిమనుమలతో కలిపి 205 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎల్లవ్వ మృతికి బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు గీట్ల తిరుపతిరెడ్డి, మండల నాయకుడు సిద్దెంకి రాజమల్లు సంతాపం ప్రకటించారు.

### బావిలో పడి వృద్ధుడు..

వీణవంక, డిసెంబర్ 24: కనపర్తి గ్రామానికి చెందిన కొయ్యడ మొగిలి (63) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యడ మొగిలి మంగళవారం ఉదయం 7 గంటలకు గ్రామ శివారులో గల వ్యవసాయ బావి వద్ద నారాయణపుర సతీశ్‌తో కలిసి విద్యుత్ మోటర్‌ను పైకిలాగే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కాగా నీటిలో మునిగి మృతిచెందాడు. అతడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి పేర్కొన్నారు.

### నీట మునిగి మహిళ ..

వీణవంక, డిసెంబర్ 24: చల్లూరు గ్రామానికి చెందిన మామిడి రాజేశ్వరి (55) నీట మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరి మూడు రోజుల క్రితం గ్రామ శివారులో గల వాగులో నీట మునిగి గల్లంతైంది. మంగళవారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించారు. రాజేశ్వరి తల్లి కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### వృద్ధుడి బలవన్మరణం

గంగాధర, డిసెంబర్ 24: రైలు పట్టాలపై తలపెట్టి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన పులిచెర్ల భూమయ్య (70) మంగళవారం కదులుతున్న రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. భూమయ్య తలపై నుంచి రైలు వెళ్లడంతో తల నుంచి మొండెం వేరైంది. రైలు పట్టాలపై భూమయ్య మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, భూమయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

### 27న దివ్యాంగుల ఉద్యోగ మేళా

కలెక్టరేట్, డిసెంబర్ 24 : ఈనెల 27న నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.సబితకుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఆపై స్థాయిలో చదువుకున్న అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం యూత్ ఫర్ జాబ్స్ ప్రతినిధుల మొబైల్ నంబర్లు 9281031017, 9885937862, 7032777493లో సంప్రదించాలని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### కలెక్టర్‌కు గ్రామాల విలీన వ్యతిరేక తీర్మాన కాపీ అందజేత

కార్పొరేషన్, డిసెంబర్ 24 : కరీంనగర్ నగరపాలక సంస్థలో గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బల్దియా సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. కాగా, సదరు తీర్మాన కాపీని మంగళవారం మేయర్ యాదగిరి సునీల్ రావు కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు.

### పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

మానకొండూర్, డిసెంబర్ 24: వార్షిక తనిఖీల్లో భాగంగా మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడారు. సరైన పద్ధతిలో రికార్డులు నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్ పొందుపర్చాలని సూచించారు. పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. అన్ని గ్రామాలకు పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫారెబి, సీఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### చివరి మడికి సాగు నీరందిస్తాం

గంగాధర, డిసెంబర్ 24: నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపి చొప్పదండి నియోజకవర్గంలోని చివరి మడి వరకూ సాగు నీరందిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. రైతులెవరూ ఆందోళన చెందొద్దని, ప్రతి ఎకరాకూ సాగు నీరు అందజేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితా శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు పాల్గొన్నారు. కాగా, గంగాధర గ్రామ రైతులు కరీంనగర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపి యాసంగి పంటలకు సాగు నీరందించాలని వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రైతులు జారతి సత్తయ్య, గంగాధర పరశురాములు, తాళ్ల నరేశ్, గంగాధర శంకర్, కిషన్, శంకర్, అంజయ్య తదితరులు ఉన్నారు.

### ఆలయానికి ఏసీ అందజేత



ఆలయానికి ఏసీని విరాళంగా అందజేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 24: మండలంలోని నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నుస్తులాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ రూ.50 వేలు విలువ గల ఏసీని విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ, అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు కందుకూరి లక్ష్మిరాజం, గాజుల అంజయ్య, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### ‘నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి’

తెలంగాణచౌక్, డిసెంబర్ 24: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావేత్త వి.నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకుడు పెద్ది శ్రీధర్ రాజు విజ్ఞప్తి చేశారు. నగరంలో ప్రెస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులు, యువతకు న్యాయం జరుగుతుందన్నారు. విద్యారంగంతోపాటు, సమాజంలోని అన్ని వర్గాలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, సిరిశెట్టి రాజేశ్ గౌడ్, దేవరకొండ సంతోషిలక్ష్మి, గడమల్ల శ్రీనివాస్, తిప్పర్తి స్వరాజ్ తోపాటు బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

### ‘అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి’

తెలంగాణచౌక్, డిసెంబర్ 24: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిషాని రామచంద్రం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందించారు. నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాతంగి అశోక్, నాయకులు మంద బాలయ్య, రాజేందర్, అక్కి బాలకిషన్, ప్రశాంత్ గౌడ్, తిరుపతి, కార్యదర్శి మాతంగి మల్లయ్య, మహేశ్, మారపెల్లి మొగిలయ్య, నిషాని రాజమల్లు, మాతంగి తిరుపతి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

కార్పొరేషన్, డిసెంబర్ 24: అంబేద్కర్ స్టేడియంలో చేపట్టిన కమర్షియల్ షెట్టర్ల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 59, 60వ డివిజన్ల పరిధిలోని ముకరంపుర, మంకమ్మతోటలో (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పైపులైన్ కనెక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరి దశ పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణ పనులు కూడా పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవీ మహేశ్, ఎస్ఈ రాజ్ కుమార్, డీఈలు లచ్చిరెడ్డి, అయూబ్ ఖాన్, ఆర్వీ టీం లీడర్ సందీప్, ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

### ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

రాంనగర్, డిసెంబర్ 24: కరీంనగర్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సృజన్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సృజన్ రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. కరీంనగర్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న విజయ్ కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఐజీ కార్యాలయానికి అటాచ్‌లో ఉన్న వి.అనిల్ కుమార్‌ను కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

### జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, డిసెంబర్ 24 : కేరళలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే 53వ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీ రాజేందర్, జీ శ్రీనువాస్ పేర్కొన్నారు. ఇటీవల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సెలక్షన్స్ ట్రయల్స్‌లో పాల్గొన్న జెట్టిపెల్లి అశోక్ (రామడుగు), జైనపురం వంశీ (గుల్లకోట) అద్భుత ప్రతిభ చూపి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని మాజీ ఎంపీపీ పానుగోటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరివేని తిరుమలాతిరుపతి ముదిరాజ్, క్రీడా సంఘాల నాయకులు అభినందించారు.

### టీఎన్జీవో కరీంనగర్ రూరల్ యూనిట్ కార్యవర్గం

కొత్తపల్లి, డిసెంబర్ 24: టీఎన్జీవో కరీంనగర్ రూరల్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా కోడూరి వాస్తవిక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్‌గా గాలి బాలాజీ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన వారికి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.